క్లుప్తంగా

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్ట రీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించి పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తున్న సెంటర్లపై దాడులు నిర్వహించి లైసెన్స్‌లు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఉన్న 252 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. 3 సెంటర్లు రిజిస్ట్రేషన్లకు దరఖాస్తు చేసుకోగా కమిటీ ఆయా దరఖాస్తులను పరిశీలించి నిబంధనకు అనుగుణంగా లేకపోవడంతో అనుమతులు మంజూరు చేయలేదన్నారు. 5 సెంటర్లు రెన్యువల్, 12 సెంటర్ల మాడిఫికేషన్‌కు అనుమతులను మంజూరు చేశామని చెప్పారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జస్టిస్ వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి మాట్లాడుతూ.. కొత్తగా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటుకు, రెన్యువల్‌కు, చేర్పులు మార్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కమిటీకి నివేదించాలన్నారు. సమావేశంలో డీసీపీఎంఎస్ బాబు, కమిటీ కన్వీనర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య మహిళా మండలి సెక్రటరీ రష్మీ, డీపీఎంఓ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ విద్యార్థుల స్వచ్ఛభారత్



మేరీమాత చర్చి ప్రాంగణంలో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి గుణదల మేరీమాత దేవాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం విద్యార్థులు మేరీమాత చర్చి ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. తొలుత స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చర్చి ఫాదర్ విక్టర్ జయరాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు డాక్టర్ నాగార్జున, డాక్టర్ కె.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ కృషి చేస్తోందన్నారు. ప్లాస్టిక్ చెత్త సేకరించటానికి అవసరమైన పరికరాలు, సంచులను పీఎంఎస్ భద్రత, బాధ్యత ఫౌండేషన్ కన్వీనర్ సింగలూరి శ్రీనివాసరావు అందజేశారు.

బ్యాంకులు లక్ష్యాలను చేరుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకానికి బ్యాంకులు బ్రాంచీల వారీగా లక్ష్యాలను చేరుకోవాలని వీఎంసీ పట్టణ సాధికారికాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి(పీఓ) శకుంతల తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో బ్యాంకర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 – 24 ఏడాదికి స్వయం సహాయక సంఘాలు గ్రూపులను యూనిట్‌గా తీసుకుని రుణ అర్హత లేకున్నా ఆయా సంఘాలను లక్ష్యంగా చేసుకుని వారికి ఈ ఏడాది జగనన్న తోడు పథకం వర్తింపజేయాలన్నారు. పథకం అమలులో లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు లోన్లు మంజూరు చేయాలని సూచించారు. కొత్తగా 350 యూనిట్లకు డ్వాక్రా లోన్లు మంజూరయ్యాయని వాటన్నింటినీ త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. బ్యాంక్ ఎల్‌డీఏ సత్యనారాయణ, యూసీడీ విభాగ సిబ్బంది సీడీఓలు, టీఈలు పాల్గొన్నారు.

పైపులరోడ్డు మీదుగా ఆటోనగర్‌కు సిటీ బస్సు సర్వీసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీ నుంచి పైపులరోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా ఆటోనగర్‌కు 33జే సిటీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు విద్యాధరపురం డిపో మేనేజర్ కనకమేడల సుబ్రహ్మణ్యేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కాలనీ వాసుల అవసరాలను పరిగణలోకి తీసుకుని జక్కంపూడి కాలనీ నుంచి నూతనంగా 33జే సర్వీసును నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. 40 నిమిషాల వ్యవధిలో మొత్తం నాలుగు బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. జక్కంపూడి కాలనీ, పైపుల రోడ్డు, డాబాకొట్లు సెంటర్, ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్, బీఆర్టీఎస్ రోడ్డు, గుణదల, కొత్త గవర్నమెంట్ హాస్పిటల్, బెంజ్‌సర్కిల్, పటమట, ఆటోనగర్ మీదుగా బస్సు సర్వీసు నడుస్తుందన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 23వ డివిజన్ 98వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, కో ఆర్డినేటర్ ఒగ్గు విక్కీ, అధికారులతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పర్యటించారు. సచివాలయ పరిధిలోని వెంకటేశ్వరరావు వీధి, కోదండ రామిరెడ్డి వారి వీధి, శేషాద్రి శాస్త్రి వీధి, మల్లాది వారి వీధుల్లో ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికుల నుంచి గ్రీవెన్స్ స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచనలు చేశారు. అలాగే ఆధార్, ఓటర్ కార్డు అనుసంధానంలో బూత్ లెవల్ ఆఫీసర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. తొలుత స్థానిక అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పింఛన్‌దారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెల్లవారుజామునే గుమ్మం వద్దకు వచ్చి పింఛన్ అందిస్తుండటంతో అవ్వాతాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు.

కౌన్సిల్‌లో టీడీపీ సభ్యుల తీరు జుగుప్సాకరం

వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ సభ్యులు ప్రవర్తించిన తీరు జుగుప్సాకరమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పింఛన్లపై మాట్లాడే ముందు టీడీపీ హయాంలో నగరంలో ఎన్ని పింఛన్లు ఉన్నాయో ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో 15 వేల కొత్త పింఛన్లు పెరిగాయన్నారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే 8 వేల పింఛన్లు పెరిగాయని చెప్పారు. పింఛన్ అర్హతను 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో లక్షల మందికి నూతన పింఛన్లు తీసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఈ నెల 25,616 మంది పింఛన్‌దారులకు 7 కోట్ల 16 లక్షల 26 వేల 750 రూపాయలు అందిస్తున్నట్లు విష్ణు తెలిపారు. టీడీపీ హయాంలో 5, 6 డివిజన్లకు కలిపి ఒకచోట, రోజుల తరబడి పింఛన్ తీసుకునే విధానాలకు స్వస్తి పలికి.. ఇంటివద్దకే వచ్చి అందిస్తుండటంతో లబ్ధిదారులు సంతృప్తి చెందుతున్నారన్నారు.

జగనన్న పాలనలో పరిశ్రమలకు నూతనోత్తేజం

సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రం పారిశ్రామిక ప్రగతివైపు దూసుకెళ్తోందని.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ పారిశ్రామికవేత్తలకు స్నేహపూర్వక హస్తం అందిస్తోందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సుకు వచ్చిన అపూర్వ స్పందనే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు పాలనలో పారిశ్రామిక అభివృద్ధి అంటే కేవలం కాగితాల మీదనే జరిగేదని విమర్శించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనూ వరుసగా మూడేళ్లు ఏపీ నంబర్ వన్ స్థానంలో ఉందని.. 11.43 % జీఎస్‌డీపీతో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. అది చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకులు విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్

నారా లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కార్యకర్తలు తప్ప ప్రజలెవరూ స్వచ్ఛందంగా పాల్గొనడం లేదన్నారు. కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



కర్నాటి రామ్మోహన్‌రావు ఉన్నత పాఠశాలలో టాయిలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని, లోపిస్తే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. నగరంలోని సూర్యారావుపేట కర్నాటి రామ్మోహన్‌రావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ ఢిల్లీ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, స్టాఫ్ హాజరు పట్టీని పరిశీలించారు. అనంతరం బాలురు, బాలికల మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, నిర్వహణ లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. టాయిలెట్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉందని కలెక్టర్ అన్నారు. ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకొని నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. గణిత శాస్త్రంలో ఆల్జీబ్రా, తెలుగులోని కొన్ని పదాలను బ్లాక్ బోర్డుపై రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ప్రణాళికబద్ధంగా ప్రతి సబ్జెక్టును చదివి అర్థం చేసుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. ఫలితాలలో జిల్లాను అగ్రగామిగా నిలిపేలా ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు తీర్చిదిద్దాలని కలెక్టర్ ఢిల్లీ రావు తెలిపారు.

ఉత్సాహంగా శ్లోక పఠన పోటీలు



విజేతలతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యాన బుధవారం భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో చిన్నారులకు అచ్యుతాష్టకం, విష్ణు సహస్రనామ స్తోత్రం శ్లోక పఠన పోటీలు జరిగాయి. ఉదయం 10 గంటలకు గణపతి పూజ, శ్రీకృష్ణ అర్చనతో పోటీలు ప్రారంభమయ్యాయి. 10 ఏళ్లలోపు చిన్నారులకు అచ్యుతాష్టకం, 15 ఏళ్లలోపు చిన్నారులకు విష్ణు సహస్రనామ స్తోత్ర శ్లోకాలు పోటీలు జరిగాయి. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలకు విష్ణుబొట్ల లక్ష్మీనారాయణ, బి.సావిత్రి, టి.సావిత్రి, పి.కనకదుర్గ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విజేతలను ప్రకటించారు. విజేతలకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఐదు జిల్లాల సూపరింటిండెంట్ ఎం.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు, శారదా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నలూరి లక్ష్మణరావు, ఆలయ కార్యదర్శి కుంచనపల్లి రవి శంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు బొగ్గరపు వెంకట బాల కోటేశ్వరరావు, తురగా ప్రసాద్, కృష్ణ సాయిబాబు, విశ్వ ధర్మ పరిషత్ సభ్యులు ఉప్పులూరు శేష ప్రసాద్ శర్మ, కోల వెంకట్రావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అచ్యుతాష్టకం పోటీల్లో వరుసగా సీహెచ్ వాహ్ని అక్షయ, జి.మహతి, కె.శ్రీ కృష్ణ కౌశల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. విష్ణు సహస్రనామ స్తోత్ర శ్లోకాల పోటీల్లో ఎం.శ్రీ సాపర్ణిక, వి.పూజిత లక్ష్మీ సాయి, ఎస్.కోమలి హరిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. విజేతలను నిర్వాహకులు అభినందించారు.

శారీరక వైకల్యాన్ని అధిగమించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

గుణదల(విజయవాడతూర్పు): శారీరక వైకల్యాన్ని అధిగమించి బధిర విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదల కార్మెల్‌లోని మడోన్న బధిర విద్యార్థుల పాఠశాల 37వ వార్షికోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో బధిర విద్యార్థులు ఇతరుల కంటే దీటుగా ఫలితాలు సాధిస్తున్నారన్నారు. విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలు, క్రీడల్లో తమ సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. బధిర విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా, విద్యా వంతులుగా తీర్చిదిద్దడానికి మడోన్న సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం బధిర విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అబ్బుర పరిచాయి. దేశ భక్తిని ఇనుమడింప చేసే దిశగా విద్యార్థులు నిర్వహించిన గ్రూప్ డ్యాన్స్ ప్రధానాకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మరియ, సిస్టర్లు అమల, రాజేశ్వరి, మల్లిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కార్యాలయం ప్రారంభం



29వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించేందుకు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కార్పొరేటర్ కార్యాలయం ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే, మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్ నేతాజీ కాలనీలో బుధవారం కార్పొరేటర్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి కార్యాలయ్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలతోమమేకమయ్యి ప్రభుత్వ సేవలను అందించేందుకు కార్పొరేటర్ కార్యాలయం దోహదపడుతుందని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి మాట్లాడుతూ డివిజన్ వాసులు ఎప్పుడు ఏ సమస్య తలెత్తినా కార్పొరేటర్ కార్యాలయంలో సంప్రదించవ్చన్నారు. కార్యాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, నాయకులు గోవిందు, ఎస్‌కే అక్బర్, శీమల గోవిందు, సుధాకర్, హుస్సేన్ బాబు, నాగమణి, పూర్ణిమ, నాగప్రియ పాల్గొన్నారు.

తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీ



సీతారామపురంలో పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ అనిత



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అర్హతే ప్రామాణికంగా సామాజిక పింఛన్లను అందజేస్తున్నామని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత తెలిపారు. సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారు జాము నుంచే లబ్ధిదారులకు పింఛన్లను అందచేశారు. సీతారామపురం, గిరిపురం, కస్తూరిభాయిపేటలో పలువురికి కొత్త పింఛన్లు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కుల, మత, వర్గ, ప్రాంతీయ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పింఛన్లు ఇచ్చే సంస్కృతి నేడు లేదని, వలంటీర్ ఇంటికే వెళ్లి అర్హత ఆధారంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, ఒబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో వలంటీర్లు బుధవారం తెల్లవారు జాము నుంచే పింఛన్‌ల పంపిణీ ప్రారంభించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తలుపుతట్టి పింఛన్లను అందజేశారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్లు అందజేయటం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాప్ కార్న్ చిత్రం యూనిట్ సందడి



సమావేశంలో మాట్లాడుతున్న హీరోయిన్ అవికా గోర్, పక్కన చిత్రం యూనిట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాప్ కార్న్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బుధవారం యూనిట్ సభ్యులు నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ అవికా గోర్ మాట్లాడుతూ పాప్‌కార్న్ చిత్రం యువతను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. సినిమాలో ఎక్కువ భాగం ఒక లిఫ్ట్‌లోనే చిత్రీకరించామని చెప్పారు. లిఫ్ట్‌లో జరిగే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. ప్రేమ కథా చిత్రమని, హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని ఆమె పేర్కొన్నారు. దర్శకుడు మురళీ కొత్త దర్శకుడు అయినప్పటికీ ఈ చిత్రాన్ని ఒక ప్రతిభగల దర్శకుడు మాదిరిగా చిత్రీకరించారన్నారు. ఇప్పటికే పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ట్రైలర్, టీజర్‌కు విశేష స్పందన లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హీరో సాయి రోనక్ మాట్లాడుతూ తాను నాలుగు చిత్రాల్లో హీరోగా నటించానని, తొలిసారిగా అవికా గోర్ లాంటి సీనియర్ హీరోయిన్‌తో నటించడం సంతోషంగా ఉందన్నారు. చిత్రాన్ని యువతతో పాటు కుటుంబ సభ్యులందరూ కూడా చూసే చిత్రమని తెలిపారు. దర్శకుడు మురళీ మాట్లాడుతూ.. తను చాలా షార్ట్ ఫిల్మ్స్ చేశానని, ఆ అనుభవంతో తొలిసారిగా పాప్ కార్న్ చిత్రం తీశానన్నారు. సమావేశంలో చిత్ర సహ నిర్మాత చలపతిరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



సమష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తున్న ఫాదర్ రవితానయ్య

గుణదల(విజయవాడతూర్పు): భక్తుల కోర్కెలు తీర్చే బంగారు తల్లిగా గుణదల మాత నీరాజనాలందుకుంటుందని రీజనల్ సుపీరియర్ ఇండియా రెవ.ఫాదర్ మార్నెని రవితానయ్య అన్నారు. గుణదల మేరిమాత పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రార్థనల రెండో రోజైన బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మరియమాత స్త్రీలందరిలో పవిత్రమైన వ్యక్తిగా పేరుపొందిందని తెలిపారు. ఆమె భక్తికి మెచ్చి దేవాది దేవుడు ఆమెను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరియమాతను ప్రార్థించడం ద్వారా సకల శుభాలు జరుగుతాయని చెప్పారు. దేవుని పట్ల విధేయతతో నడుచుకోవాలని, ఆయన ప్రేమ మార్గాన్ని అనుసరించాలని కోరారు. అనంతరం మరియమాత బలిపీఠం వద్ద సమష్టి దివ్య పూజ నిర్వహించారు. అంతకు ముందు పుణ్యక్షేత్ర గురువులు, మఠ కన్యలు, పలు విచారణల నుంచి వచ్చిన విశ్వాసులు కొవ్వొత్తులు చేతబూని కొండ పైకి చేరుకున్నారు. జపమాల ధ్యానంతో మరియ తల్లిని వేడుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ విజయకుమార్ పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడ సెంట్రల్): బైకులు, కార్లు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌లు, సీట్‌బెల్ట్‌లను ధరించడం ఎంతో ఉత్తమమని, సురక్షితమైన ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ వాటిని తప్పనిసరిగా ధరించాలని నున్న సీఐ కె.శ్రీనివాసరావు ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నార్త్ జోన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్ ఆదేశాల మేరకు నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్రిక జంక్షన్ వద్ద ప్రయాణికులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్‌లు బండి హ్యాండిల్‌కు తగిలించడం, వెనుకభాగంలో పెట్టుకోవడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని, బైకు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. దీనిద్వారా మనతో పాటు మనపై ఆధారపడిన మన కుటుంబ సభ్యులకు కూడా తీరని నష్టం వాటిల్లుతుందని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని వృద్ధులకు, దివ్యాంగులు, వితంతువులకు ప్రతి నెలా ఓ పండుగలా పెన్షన్లు పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు ఇటువంటి బృహత్కర కార్యక్రమాలపై కూడా అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. 59వ డివిజన్‌లోని పెన్షన్‌దారులకు బుధవారం ఆయన వైఎస్సార్ పెన్షన్ కానుకలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలోని అవ్వ, తాతలు, దివ్యాంగుల జీవితాలు పూర్తిగా మారిపోయాయని, ప్రతి నెలా తమకు వేతనాలు మాదిరిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఠంచనుగా ఒకటో తేదీనే పెన్షన్‌ను అందిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద వారికి మేలు జరుగుతుంటే టీడీపీ, ఎల్లో మీడియా జీర్ణించుకోలేకపోతున్నాయని వృద్ధాప్య పెన్షన్లు, అమ్మ ఒడి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వంటి పేదల బతుకులు మార్చే విప్లవాత్మక పథకాలపై కూడా అసత్య ఆరోపణలు చేసి పేదలకు మేలు జరగకుండా అడ్డుపడాలని చూస్తున్నాయని మండిపడ్డారు. రానున్న రోజుల్లో పెన్షన్‌దారులే ఈ ప్రతిపక్షపార్టీల నాయకులను తన్ని తరిమే రోజు వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, గుంజా చిన్నా, షేక్ అమిత్, రాజు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సే నో టు డ్రగ్స్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు సూచించారు. 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమంలో భాగంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన యువకులకు స్థానిక పోలీస్‌కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవించడం వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రాణించడం కష్టతరమవుతుందని చెప్పారు. సమాజంలో గౌరవం ఉండదన్నారు. మత్తు పదార్థాలు అనేక మానసిక సమస్యలకు దారి తీస్తాయన్నారు. మత్తు పదార్థాలను సేవించడం మానేసి సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. డ్రగ్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మానసిక వైద్యులు శంకర్, శ్రావణి, తేజోవతి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జి.వి.రమణమూర్తి, సీఐలు శ్రీధర్ కుమార్, నాగశ్రీనివాస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఈఎస్ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం అంధకారంగా మారుతుందని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని అజిత్‌సింగ్‌నగర్ సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ సూచించారు. నగర పోలీసు కమీషనర్ ఆదేశాల మేరకూ సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ స్కూల్‌లో 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు ఒక్కసారి అలవాటుపడితే బయటకు రావడం చాలా కష్టమన్నారు. ప్రధానంగా విద్యార్థులు ఇటువంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలంటే నేటి విద్యార్థులైన మీ అందరి చేతుల్లోనే ఉందని, డ్రగ్స్‌కు దూరంగా ఉండి, సమాజానికి ఉపయోగపడేలా జీవించాలన్నారు. స్కూల్ యాజమాన్యం, ఎస్ఐ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ